## క్లుప్తంగా

### నేడు బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

చిలుకూరు : మండల కేంద్రంలో గురువారం పార్లమెంట్ ఎన్నికలపై బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం విలేకరులకు తెలిపారు. చిలుకూరులో పార్టీ నాయకుడు అంబాల రాంబాబు ఇంట్లో సమావేశం ఉన్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

నడిగూడెం : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు మౌలిక వసతులు కల్పించాలని టీవ్యకాస్ఎస్ మండల అధ్యక్షుడు బంధారు గుర్వయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని శ్రీరంగాపురంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల వద్ద తాగునీరు, నీడ కోసం టార్పాలిన్, ప్రథమ చికిత్స కోసం మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

### రేపు శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఆవిష్కరణ

చిలుకూరు : మండల పరిధిలోని కవిత జూనియర్ కళాశాల వద్ద కోదాడ- జడ్చర్ల రహదారిపై నూతనంగా నిర్మించిన శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవం శుక్రవారం ఉన్నట్లు ఆలయ మాదాధిపతులు పమ్మి బ్రహ్మయ్యచారి బుధవారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మంగళతోరణం, విఘ్నేశ్వర, నవగ్రహ తదితర పూజా కార్యక్రమాలు ఉన్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ఎన్నికల హామీలను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి

నడిగూడెం : ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విస్మరించారని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9న రైతు బంధు, రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి అమలు చేయకుండా రైతులను మోసం చేశారని, ఆగస్టు 15 తర్వాత చేస్తామని గారడీ మాటలతో మాట్లాడడం తగదన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని రైతాంగానికి పిలుపునిచ్చారు.

### బావి చుట్టూ కట్ట నిర్మాణం


కట్ట నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోతె : మండల పరిధిలోని రాంపురంతండాలో గతంలో తాగు నీటి అవసరాల కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హయాంలో తవ్వించిన బావిలోకి మురుగు నీరు, వర్షపు నీరు చేరకుండా బుధవారం బావి చుట్టూ కట్ట నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి, నాగునాయక్, రాములునాయక్, రమేష్, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నారసింహునికి గరుడ వాహన సేవ


గరుడవాహనంపై ఊరేగుతున్న శ్రీస్వామివారు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, వందమ్మ తాలికేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా ముస్తాబుచేసి ఎదుర్కోళ్ల మహోత్సవం సంవాదం రక్తికట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయకుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి శ్రీధరాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరి నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- 32 గ్రామ పంచాయతీల్లో 2.70 లక్షల మొక్కలు పెంపకం
- వేసవి తాపానికి గురికాకుండా నర్సరీల్లో పందిళ్లు ఏర్పాటు
- ప్రతిరోజూ నీరందిస్తూ ఎండిపోకుండా కాపాడుతున్న సిబ్బంది


గరిడేపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



**2.70 లక్షల మొక్కలు పెంచుతున్నాం**

మండల వ్యాప్తంగా 2 లక్షల 70వేల మొక్కలు పెంచుతున్నాం. ఎప్పటికప్పుడు అధికారులు నర్సరీలను తనిఖీ చేస్తున్నారు. వర్షాలు కురిసిన వెంటనే ప్రభుత్వ ఆదేశాల మేరకు హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు పంపిణీ చేస్తాం. ప్రభుత్వ స్థలాల్లో నాటిస్తాం. – కన్యంతరెడ్డి వనజ, ఎంపీడీఓ

గరిడేపల్లి : వేసవి దృష్ట్యా గరిడేపల్లి మండలంలోని నర్సరీల్లో మొక్కల సంరక్షణపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. ఎండలాంలో వేసవి తాపానికి గురికాకుండా నర్సరీల్లోని మొక్కలపై పందిళ్లు ఏర్పాటు చేశారు. నిత్యం మొక్కలకు నీటిని అందిస్తున్నారు. హరితహారం కార్యక్రమం కింద జూలై నెలలో పంపిణీ చేసేందుకు, రోడ్ల వెంట నాటేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. 32 గ్రామ పంచాయతీల పరిధిలోని 32 నర్సరీల్లో ఉపాధి హామీ పథకం కింద 2 లక్షల 70 వేల మొక్కలు పెంచి పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. నర్సరీల్లో గానుగ, బిల్వ, గులాబీ, విరజాజి, చామంతి, మందార, జామ, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, వద్దితో పాటు పలు రకాల మొక్కలను పెంచుతున్నారు. అయితే గత జూలై నెలలో నర్సరీ పనులు ప్రారంభించి ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో విత్తనాలు విత్తారు. ప్రస్తుతం మొక్కలు పెరిగే దశలో ఉన్నాయి. కాగా, నర్సరీలను స్థానిక ఎంపీడీఓ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు సందర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు కూడా నర్సరీలను తనిఖీ చేస్తూ సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఈ మొక్కలను రక్షించేందుకు నర్సరీల్లో కూలీలను ఏర్పాటు చేశారు.

### రైస్‌మిల్లు తనిఖీ


బేతవోలులో ఆంజనేయ రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ధ్రువకుమార్

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో గల ఆంజనేయ రైస్ మిల్లును బుధవారం తహసీల్దార్ ధ్రువకుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మిల్లులోని నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు. నిబంధనల ప్రకారం రైస్‌మిల్లు నిర్వహించాలని సూచించారు. అనంతరం బేతవోలు, పోలేనిగూడెం గ్రామాల్లోని రేషన్ షాపులను ఆయన పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అదేవిధంగా బేతవోలు గ్రామంలోని ఎన్నికల పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### వేసవిలో పశుసంరక్షణపై రైతులకు అవగాహన

చిలుకూరు : వేసవిలో పశువుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి వీరారెడ్డి అన్నారు. బుధవారం చిలుకూరులోని పశువైద్యశాలలో వేసవిలో పశు సంరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో పశువులకు నీటి ఎద్దడి లేకుండా చూడాలని అన్నారు. పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి వీరారెడ్డి

# ఎక్సైజ్ అధికారుల దాడులు

- 12 మందిపై కేసులు నమోదు


పట్టుబడ్డ నిందితులు, సారా, పట్టిక, బెల్లంతో ఎక్సైజ్ సీఐ, ఈఎస్, అధికారులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో సీఐ నాగార్జున రెడ్డి దాడులకు సంబంధించి వివరాలను వెల్లడించారు. నల్లగొండ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సంతోష్‌రెడ్డి, సూర్యాపేట ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గరిడేపల్లి మండలం మంగాపురంతండా, రేగులగడ్డతండా, కుతుబుషాపురం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు 8 టీమ్‌లుగా ఏర్పడి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో రేగులగడ్డకు చెందిన బాణోత్ పద్మ, బాణోత్ సునిత, బాణోత్ జగన్, బాణోత్ నవాబ్, కుతుబుషాపురంనకు చెందిన మేకల పద్మలను అరెస్ట్ చేశామన్నారు. బాణోత్ సావిత్రి, బాణోత్ సామెల్లు పరారీలో ఉన్నారని చెప్పారు. అంతేకాకుండా మంగాపురంనకు చెందిన ధరవత్ కమలమ్మ, ధరవత్ బాషానాయక్‌లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం ధ్వంసం చేసి దానిని తమ పాలాల్లో దాచి ఉంచిన ధరావత్ ధర్మ, బుర్ర అంజయ్యలపై కేసు నమోదు చేశామన్నారు. అదే గ్రామానికి చెందిన రామవత్ మంగ ఇంట్లో దాచిన సారా, బెల్లం పానకం ధ్వంసం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరందరి వద్ద నుంచి మొత్తం 42 లీటర్ల సారా, 20 కేజీల పట్టిక, 50 కిలోల బెల్లం స్వాధీనం చేసుకుని 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాకేష్, జిల్లా స్పెషల్ స్క్వాడ్ కోదాడ, ఈంగమర్తి సీఐలు మల్లయ్య, శంకర్, రజిత, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**117 కేసులు నమోదు..**

ఎన్నికల నిబంధనలు అమలైన నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో అన్ని టీమ్స్, హుజూర్‌నగర్ ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నియోజకవర్గంలో నిర్వహించిన దాడుల్లో మంగళవారం వరకు 117 కేసులు నమోదు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. లిక్కర్, బీర్లు, సారా, బెల్లం, పట్టికను స్వాధీనం చేసుకోవడమే కాకుండా 18 వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. స్వాధీనం చేసుకున్న వాటి విలువ సుమారు రూ.30 లక్షలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## కొనసాగుతున్న రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణానికి హాజరైన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు

కోదాడరూరల్ : మండలంలోని గణపవరంలో గల శ్రీవరదర రంగనాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఉమ్మడి రాష్ట్ర ఇన్విటేషన్ కబడ్డీ ఫైనల్ పోటీలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. బుధవారం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ పొట్ట శ్రీవిజయ కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇర్ల లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యుడు సిహెచ్.లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీ సింగారెడ్డి హిమబిందు సుమన్‌రెడ్డి, వర్లపసేనరెడ్డి, ఇర్ల సీతారామరెడ్డి, చిట్టా రాంరెడ్డి, పొట్ట జగన్‌మోహన్‌రావు, అల్లుపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గోదాదేవి తిరుకల్యాణం

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీగోదాదేవి తిరుకల్యాణ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీవేణుగోపాలస్వామి రుక్మిణి, సత్యభామ సమేతముగా గజవాహన సేవ, గోదాదేవి తిరుకల్యాణంలో భాగంగా ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనము, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదనంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహా నివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బుధవారం పూజల అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, మనోహరాచార్యులు, మధుసూదనాచార్యులు, జనార్దనాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


తాళిబొట్లు చూపుతున్న అర్చకుడు

# ఇంటర్ ఫలితాల్లో 'ప్రభుత్వ' విద్యార్థుల ప్రతిభ

హుజూర్‌నగర్ : ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన పలువురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బీడీఎస్ ప్రసాద్ బుధవారం తెలిపారు. కాలేజీ టాపర్లుగా నిలిచిన వారిలో ఇంటర్ సెకండియర్ ఎంపీసీలో పి.చైతన్య 979/1000 మార్కులతో మొదటి స్థానం, ఎస్.మధురెడ్డి 953 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. బైపీసీలో వర్షి (964) ప్రథమ స్థానం, జి.మహాలక్ష్మి (945) ద్వితీయ స్థానం, సీఈసీలో బి.సంధ్య (797) ప్రథమ స్థానం, ఎస్.నేహామాల (787) ద్వితీయ స్థానం, హెచ్‌ఈసీలో ఎం.అమూల్య (630) ప్రథమ స్థానం, వైష్ణవ్య (607) ద్వితీయ స్థానం, ఓవీలో ఆర్.సంధ్యని (899) ప్రథమ, ఎం.నరేష్ (847) ద్వితీయ స్థానం, ఈటీలో టి.దర్శాజకుమార్ (824) ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఆర్. ఇందు (452/470) మొదటి స్థానం, టి.సంజన (428) ద్వితీయ స్థానం, హెచ్‌ఈసీలో ఆర్.శివకాంతి 427/500) ప్రథమ స్థానం, ఓవీలో కె.ఐశ్వర్య, పి.వెంకటేష్‌లు (449/500) ప్రథమ స్థానం, కె.నాగేశ్వరరెడ్డి (432/500) ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బాలికల గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో..**

నడిగూడెం : ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం ప్రకటించిన ఫలితాల్లో స్థానిక బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రథమ సంవత్సరంలో 79 మంది పరీక్షలకు హాజరు కాగా 65 మంది ఉత్తీర్ణులైనట్లు, ద్వితీయ సంవత్సరంలో 77 మంది పరీక్షలకు హాజరు కాగా 65 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ ధన విజయలక్ష్మి బుధవారం విలేకరులకు తెలిపారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో జనరల్ కోర్సులలో 51 మందికి గాను 22 మంది ఉత్తీర్ణులైనట్లు, వృత్తి విద్య కోర్సుల్లో 79 మందికి 57 మంది ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య తెలిపారు. ప్రథమ సంవత్సరంలో జనరల్ విభాగంలో 36 మందికి పదుగురు, వృత్తి విద్య కోర్సుల్లో 85 మందికి 58 మంది ఉత్తీర్ణులైనట్లు ఆయన పేర్కొన్నారు.

**సత్తా చాటిన కస్తూర్బా, మోడల్ స్కూల్ విద్యార్థులు**

గరిడేపల్లి : ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. గడ్డిపల్లిలోని మోడల్ స్కూల్‌కు చెందిన మోర్తాల జ్యోతి సెకండియర్ ఎంపీసీ విభాగంలో 979 మార్కులు, బైపీసీలో కె.వినిత 889 మార్కులు, సీఈసీ విభాగంలో మానిక 817 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎ.దివ్య 418 మార్కులు, బైపీసీ విభాగంలో బి.సాధిక 418 మార్కులు, సీఈసీ విభాగంలో చంద్రకళ 429 మార్కులు సాధించారని, విద్యార్థులు మొదటి సంవత్సరంలో 59 శాతం, ద్వితీయ సంవత్సరం 95 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉష్యా తెలిపారు. గరిడేపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ద్వితీయ సంవత్సరం బైపీసీలో డి.కావ్య 943 మార్కులు, బి.శిరీష 929 మార్కులు, ఎంపీసీ విభాగంలో బి.నవ్య 914 మార్కులు, బి.రాజేశ్వరి 878 మార్కులు, మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో మానస 398 మార్కులు, టి.నవనీత 367 మార్కులు, బైపీసీ విభాగంలో హారిక 400 మార్కులు, రాజ్యలక్ష్మి 375 మార్కులు సాధించారని స్పెషల్ ఆఫీసర్ శైలజ తెలిపారు. మొదటి సంవత్సరంలో 94 శాతం, ద్వితీయ సంవత్సరంలో 91 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.


పి.చైతన్య, హుజూర్‌నగర్ (ఎంపీసీ, 979)


ఆర్.ఇందు, హుజూర్‌నగర్ (ఎంపీసీ, 452)


వర్షిత, హుజూర్‌నగర్ (బైపీసీ, 964)


మాధురెడ్డి, హుజూర్‌నగర్ (ఎంపీసీ, 953)


టి.సంజన, హుజూర్‌నగర్ (ఎంపీసీ, 428)


ఎం.జ్యోతి, గరిడేపల్లి (ఎంపీసీ, 979)


కావ్య, గరిడేపల్లి (బైపీసీ, 943)


శిరీష, గరిడేపల్లి (బైపీసీ, 929)

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా గురువారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నదని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ బుధవారం తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ కాలనీ, తిలక్ నగర్, పీర్ల కొట్టం బజార్, లింగగిరి రోడ్డు, శ్రీనగర్ కాలనీ, ఎన్ఎస్పీ క్యాంప్, గాంధీ పార్క్, మఠంపల్లి బైపాస్ రోడ్డు, సాయిబాబా గుడి ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

**పాలకీడు సబ్‌స్టేషన్ పరిధిలో..**

గరిడేపల్లి : మండలంలోని పాలకీడు సబ్ స్టేషన్ పరిధిలో పొనుగోడు ఫీడర్ విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున పొనుగోడు ఫీడర్‌కు ఉదయం 7గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ రామిరెడ్డి నరేష్ బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పటిష్ట బందోబస్తు

- సీఐ చరమందరాజు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానది పై గల హైలెవల్ వంతెనపై ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు తెలిపారు. బుధవారం మట్టపల్లి వద్ద ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య అక్రమ వ్యాపారాలు, మాఫియాలు రాకపోకలు తావులేకుండా 24 గంటల నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మఠంపల్లి, హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల పరిధిలో ఎలాంటి ఆధారాలు చూపని రూ.52.61 లక్షల నగదు, వస్తువులు, బంగారు ఆభరణాలతో పాటు 290 లీటర్ల లిక్కర్‌ను సీజ్ కేశామన్నారు. రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో ఉన్న 273 మందిని ముందస్తుగా తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు చెప్పారు. మట్టపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.22లక్ష 15వేల విలువ గల ఆధారాలు లేని రెడీమేడ్ దుస్తులను సీజ్ చేశామన్నారు. అక్రమంగా బెల్టు షాపుల నడుపుతున్న 33 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రెండు రాష్ట్రాలతో సంబంధాలు కలిగిన వ్యక్తుల బ్యాంకు లావాదేవీలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఫ్లయింగ్ స్క్వాడ్, జీఎస్టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా ముగిసేవరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.


మట్టపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ చరమందరాజు

## నీటితొట్లు నింపి.. పశువుల దాహార్తి తీర్చి

కోదాడరూరల్ : కోదాడ మండలంలో ఐదెస్ కిలోమీటర్ల నిర్మించిన నీటి తొట్లు ప్రస్తుతం పాడి రైతుల దాహార్తిని తీరుస్తున్నాయి. అయితే ఉమ్మడి రాష్ట్రంలో 2003లో వర్షాల లేక తీవ్రమైన కరువు ఏర్పడింది. దీంతో గ్రామాల్లో చెరువులు, వాగులు, బావులు పూర్తిగా ఎండిపోయాయి. ఆ సమయంలో మూగజీవాలు నీటికి ఇబ్బంది పడొద్దని రాష్ట్ర వ్యాప్తంగా నీటి తొట్లను నిర్మించారు. కానీ కొద్ది రోజుల తర్వాత పశువులకు ఉపయోగపడ్డాయి. తొట్లను నిర్మించిన మరుసటి సంవత్సరం నుంచి వర్షాలు సమృద్ధిగా పడటంతో వీటి అవసరం లేకుండా పోయింది. కొన్ని గ్రామాల్లో శిథిలావస్థకు చేరగా మరికొన్ని గ్రామాల్లో అసలు లేకుండానే పోయాయి. అయితే ఈ ఏడాది కూడా అప్పటిలాగానే వర్షాలు లేక కరువు రావడంతో గ్రామాల్లో ఉన్న నీటితొట్లను మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ సిబ్బందిని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ప్రత్యేక అధికారులు తమ గ్రామపంచాయతీ సిబ్బందితో నీటి తొట్లలో నీటిని నింపుతున్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరలో ఇలా గేదెలు నీటితొట్లలో నీటిని తాగుతూ కనిపించాయి.


తమ్మరలో నీటితొట్టిలో నీటిని తాగుతున్న గేదెలు

# వైభవంగా విగ్రహ, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠాపనోత్సవం

చిలుకూరు : మండలంలోని నారాయణపురంలో నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో కనకదుర్గమ్మ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నవగ్రహ, జీవధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, బంధుమిత్రులతో రాకతో గ్రామం కిటకిటలాడింది.

**గుండ్లపల్లిలో ధ్వజస్తంభాల ప్రతిష్ఠ..**

మఠంపల్లి : మండలంలోని గుండ్లపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయం ఎదుట బుధవారం ధ్వజస్తంభాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞకర్త బొర్రా వెంకటవాసుదేవాచార్యులు, వావిలాల లక్ష్మీనారాయణశర్మ, నగరినారాయణ సత్యనారాయణాచార్యులు, సాయికృష్ణమాచార్యులు, కొండిల్యశర్మ, వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో వివిధ రకాల పూజలు నిర్వహించారు. హోమం నిర్వహించి పూర్ణాహుతి చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండా వెంకటరమణ బ్రహ్మారెడ్డి, చింతలపాలెం జెడ్పీటీసీ చంద్రశేఖర్, ఎంపీటీసీ వెంకటరెడ్డి, పోశం వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త పోశం నర్సిరెడ్డి, సాగర్ సిమెంట్స్ పరిశ్రమ అధికారి ఊడి వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సత్యవతి, సుదర్శన్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లి: గుండ్లపల్లిలో శివాలయం, రామాలయం ఎదుట ధ్వజస్తంభాలు ప్రతిష్ఠిస్తున్న అర్చకులు, గ్రామస్తులు

**శ్రీబాలగురుప్ప ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు**

నడిగూడెం : మండలంలోని రామాపురంలో శ్రీబాలగురుప్ప ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద గణపతిపూజ, పుణ్యావచనం, రక్షాబంధనము, అఖండ దీపారాధన, యాగశాల ప్రవేశము, అంకురార్పణ నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, వేదపారాయణం, చండీపారాయణం, అగ్నిమథనం, వాస్తుపూజ, యాగం తదితర పూజా కార్యక్రమాలను ఋత్విక్కులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


చిలుకూరు : కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మఠంపల్లి : పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు


నడిగూడెం: యాగం నిర్వహిస్తున్న వేద పండితులు

## ట్రాలీఆటోను ఢీకొన్న సిమెంట్ ట్యాంకర్

- ఏడుగురికి తీవ్రగాయాలు

హుజూర్‌నగర్ : ప్రయాణికులతో వెళ్తున్న ఓ ట్రాలీ ఆటోను సిమెంట్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్ర గాయాలైన ఘటన హుజూర్‌నగర్ శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన కనుగు వీరబాబు కుమార్తె వివాహం గరిడేపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ యువకుడితో జరిగింది. కాగా వెల్లటూరుకు చెందిన పఠాని నాగమణి, కారింగుల మంగమ్మ, దాసు లక్ష్మి, కాటబోయిన వెంకటరమణ, పోగుల రాజేశ్వరి, మనీషా, కోలేపల్లి గోపి అదే గ్రామానికి చెందిన దాసు వీరబాబు టాటా ఇంట్రా వాహనంలో వెళ్లి పెళ్లి చూసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో పట్టణ శివారులోని ఎస్‌సీఎల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీస్ సమీపంలోకి రాగానే సిమెంట్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే స్థానికులు గమనించి మెరుగైన చికిత్స నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే గ్రామానికి చెందిన శేషం గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.


ప్రమాదానికి కారణమైన సిమెంట్ ట్యాంకర్